క్లుప్తంగా

ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలి



నిజామాబాద్ సిటీ: ప్రతి ఒక్కరూ స్వచ్ఛదనం కోసం పాటుపడాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని బల్దియా కమిషనర్ దిలీప్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఐటీఐ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం చేశారు. గ్రౌండ్‌లో పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి చెత్త వాహనంలో వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవిబాబు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ



నిజామాబాద్‌నాగారం: వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు చెన్న రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పెద్ద రామ్‌మందిర్ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి చింతల పెద్ద బైరయ్య, కోశాధికారి జి కృష్ణ ప్రసాద్, దీకొండ దేవేందర్, హెచ్‌ఎం ఆనంద్, వాసవి క్లబ్ వనిత ఇందూరు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ సిర్పూర్ కు చెందిన విద్యార్థులు ఇటీవల జిల్లా స్థాయి, వురిమళ్ల ఫౌండేషన్ వారు నిర్వహించిన జాతీయస్థాయి కవితా, కథా రచన పోటీల్లో పాల్గొన్న ఎం. మేఘన, ఎం. మాధురి బహుమతులు అందుకున్నారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, గాయత్రీ నీలేశ్, వందన, అక్బర్ బాషా, డాక్టర్ హజారే శ్రీనివాస్, లలిత, ఎం. మాధురి, ఎం.మేఘన, జె.హిందు శ్రీ , ఎం. హరిణి, కృష్ణవేణి, రజిత, వంశిక, ఎం. వైష్ణవి, ఆర్. శ్రావణి, ఎస్.నిఖిత, ఎం.అనన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ టీషర్టుల విడుదల



నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ నాయకుడు, అథ్లెట్ సయ్యద్ ఖైసర్‌కు చెందిన స్పోర్ట్స్ అకాడమీ టీషర్టులు, బ్రోచర్‌ను పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ జిల్లాకేంద్రంలోని తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా నవంబర్ 9న ప్రత్యేక స్పోర్ట్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సయ్యద్ ఖైసర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, నాయకులు బాడ్సి శేఖర్ గౌడ్, నరేందర్ సింగ్, ఆకుల మహేందర్, సుభాష్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే వేడుకలు

సిరికొండ: మండల కేంద్రంలోని పీఎంశ్రీ తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల/కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం రాజేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సౌమిత్రి, అధ్యాపకులు హేమలత, సాయన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

నిజామాబాద్ రూరల్: కేజీబీవీ, మోడల్ స్కూల్ నాన్ టీచింగ్, వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని టీయూసీఐ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ అన్నారు. మోపాల్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కాలేజీలుగా అప్ గ్రేడ్ అయిన కేజీబీవీల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలన్నారు. ఈ నెల 22న హైదరాబాద్‌లో చేపట్టే ఎస్‌పీడీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుమలత, కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది కావ్య, లక్ష్మి, పుష్పలత, ప్రేమ, వాసుకి, పద్మ, సంతోషి, సుజాత, సరోజ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



రామకృష్ణ విద్యాలయంలో పేర్చిన బతుకమ్మలతో విద్యార్థినులు



నిశితా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

నిజామాబాద్ సిటీ/ ధర్పల్లి/ డిచ్‌పల్లి/ నిజామాబాద్ నాగారం/ సిరికొండ/ నిజామాబాద్ రూరల్: పాఠశాలలు, కళాశాలల్లో శనివారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. దసరా సెలవులు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా శనివారమే ముందస్తుగా బతుకమ్మ వేడుకలు చేశారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులతో కలిసి బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. అనంతరం స్థానికంగా ఉన్న కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. జిల్లా కేంద్రంలోని రామకృష్ణ విద్యాలయంలో, సెయింట్ జేవియర్స్ హైస్కూల్‌లో, ధర్పల్లి మండలం దుబ్బాకలోని శ్రీవిద్య పాఠశాలలో, డిచ్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ధర్మారం(బి) లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో, జిల్లా కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో, సిరికొండలోని కిడ్స్‌పార్క్ స్కూల్, ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో, నగరంలోని నిశిత డిగ్రీ కళాశాలలో విద్యార్థులు బతుకమ్మ ఆడారు.



ధర్పల్లి: దుబ్బాకలోని శ్రీవిద్య పాఠశాలలో..



సెయింట్ జేవియర్స్ స్కూల్‌లో



డిచ్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



సిరికొండ కిడ్స్‌పార్క్ స్కూల్‌లో..



ధర్మారంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో..



గాయత్రినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో..

‘చెక్’ లేని డ్యాములు

- రూ. లక్షలు వెచ్చించినా ప్రయోజనం శూన్యం
- తెగిపోవడంతో వృథాగా పోతున్న నీరు

సిరికొండ: భూగర్భ జలాలను పెంపొందించేందుకు చేపట్టిన చెక్ డ్యాంల నిర్మాణాలు ‘నీరు’గారుతున్నాయి. రూ. లక్షలు వెచ్చించి చెక్ డ్యాంలను నిర్మించినా పనులు నాసిరకంగా ఉండటంతో చెక్ డ్యాంలు తెగిపోయి నీటి నిల్వ జరగకుండా పోతోంది. గత ఇరవై ఏళ్ల క్రితం మండలంలోని వివిధ గ్రామాల్లో గల వాగులు, ఒర్రెలపై చెక్ డ్యాంలను నిర్మించారు. చెక్ డ్యాంల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. లక్షలు ఖర్చు చేసింది. కానీ పనులు నాణ్యతా లోపంతో జరగడంతో చెక్ డ్యాంల్లో ఎక్కడా నీరు నిల్చిన దాఖలాలు కనపడటం లేదు. నీటి ఉధృతికి అనుగుణంగా చెక్ డ్యాంలను నిర్మించక పోవడంతో అవి వృథాగా మారాయి. వాగుల్లో, ఒర్రెల్లో చెక్ డ్యాంలను నిర్మించిన చోట వాటిలో ఇరు వైపులా గట్లకు సిమెంట్‌తో రాతి కట్టడాలను నిర్మించకపోవడంతో నీటి ఉధృతిని తట్టుకోలేక చెక్ డ్యాంలకు ఇరు పక్కల గట్లు తెగిపోయి అవి నిరుపయోగంగా తయారయ్యాయి. మరి కొన్ని చోట్ల చెక్ డ్యాంల అడుగు భాగంలో సిమెంట్ కట్టడం నాణ్యతగా లేక లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో నీటి నిల్వతో కళ కళ లాడాల్సిన చెక్ డ్యాంలు నీరు లేక బోసిపోతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో దాదాపు వందకు పైగా చెక్ డ్యాంలను నిర్మించారు. వీటిలో ఎక్కువ శాతం చెక్ డ్యాంలు తెగిపోయి వృథాగా ఉన్నాయి. చెక్ డ్యాంలకు కొద్ది పాటి మరమ్మతులు చేపడితే ఎన్నో చెక్ డ్యాంలు వినియోగంలోకి వస్తాయి. కానీ నీటి పారుదల శాఖ అధికారులు మాత్రం వాటి వైపు కన్నెత్తి చూడటం లేదు. నీటి ఎద్దడి తలెత్తకుండా తీవ్ర చర్యలు చేపడుతున్నామంటూ అధికారులు ఊదరగొట్టే ప్రసంగాలు చేయడమే తప్ప ఆచరణలో మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదడానికి మండలంలోని చెక్ డ్యాంలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. మిషన్ కాకతీయలో కొత్త చెక్ డ్యాంలను నిర్మిస్తున్నారు కానీ పాత వాటిని పట్టించుకోకపోవడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్వల్ప మరమ్మతులు చేయిస్తే భూగర్భ జలాలు వృద్ధి చెందే అవకాశం ఉన్న చెక్ డ్యాంల వైపు నీటి పారుదల శాఖ అధికారులు దృష్టి పెట్టాలని మండల రైతులు కోరుతున్నారు.



గడ్కోల్ పుసాల తండా సమీపంలో తెగిపోయిన చెక్‌డ్యాం (ఫైల్)



ముషీర్‌నగర్ సమీపంలో చెక్ డ్యాం తెగిపోవడంతో వృథాగా పోతున్న వరద నీరు

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



వాలీబాల్ విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఏసీపీ



పడకల్‌లో మాట్లాడుతున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

- ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

జక్రాన్‌పల్లి: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి అన్నారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో గ్రామాభివృద్ధి కమిటీ, ఉద్యోగ అసోసియేషన్ సభ్యులు, గల్ఫ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ పాఠశాలల క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల స్థాయిలో విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమని అన్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ వినోద్, జక్రాన్‌పల్లి ఎస్సై మాలిక్ రహమాన్, క్రీడల కన్వీనర్ సురేందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ పవన్‌కుమార్, వీడీసీ సభ్యులు రాజేశ్వర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, బండారి నాగేశ్, ఉద్యోగ అసోసియేషన్ సభ్యులు సీఐ గడ్డం నాగేశ్, అంకం నరేశ్, గంట సుధాకర్, మేకల నర్సయ్య, బండారి మోహన్, పిల్లి పోశన్న తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక అభివృద్ధి అంతంతే

నిజామాబాద్‌నాగారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తగిన నిధులు కేటాయింపులు లేక మున్సిపాలిటీల అభివృద్ధి పూర్తిగా పడకేసిందని తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవన్‌లో నిర్వహించిన నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా పట్టణ స్థానిక సంస్థలను స్వతంత్రంగా పనిచేసేలా అధికారాలు, నిధులు ఇవ్వాలని ఆయన అన్నారు. వరదలను తట్టుకునేలా పట్టణాలను నిర్మించాల్సిన అవసరం ఉందని దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో వంద నగరాలను ఎంపిక చేసుకొని స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తామని దశాబ్ద కాలం క్రితం ప్రకటించిందన్నారు. నేటికీ ఒక్క నగరం కూడా స్మార్ట్ సిటీగా మారలేదని అన్నారు. కార్యక్రమంలో కె. రామ్మోహన్ రావు, షేక్ హుస్సేన్, మల్లేశ్‌రెడ్డి, సబ్బని లత, ఈవీఎల్ నారాయణ, సాదుద్దీన్, జి. నరేందర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆయుర్వేద వైద్యంతో ఎంతో లాభం

నిజామాబాద్‌నాగారం: ఆయుర్వేద వైద్యంతో ప్రతి ఒక్కరికి ఎంతో లాభం చేకూరుతుందని జిల్లా ఆయుష్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ గంగదాస్ అన్నారు. 10వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాల్లో భాగంగా శనివారం శంకర్ భవన్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. అతి పురాతమైన ఆయుర్వేద వైద్యానికి ప్రస్తుతం డిమాండ్ పెరుగుతోందని అన్నారు.

అనంతరం డాక్టర్ తిరుపతి విద్యార్థినులకు యోగా ప్రాముఖ్యతను, హెడ్ రామచందర్ గైక్వాడ్ మాట్లాడుతూ మారుతున్న జీవన శైలిలో ఆయుర్వేద ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ విభాగం ఫార్మసిస్టులు పురుషోత్తం, ఉమా ప్రసాద్, భిక్షపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గంగదాస్

అంగన్‌వాడీ టీచర్లను భయభ్రాంతులకు గురిచేయొద్దు

నిజామాబాద్ సిటీ: జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టకున్నా, వారిని పోలీసులు భయభ్రాంతులకు గురిచేయడం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మండిపడ్డారు. శనివారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లను భయభ్రాంతులకు గురి చేసేవిధంగా పోలీసులు వ్యవహరించారన్నారు. మహిళలు అని చూడకుండా ఇబ్బందులకు గురిచేస్తూ, బలవంతంగా ఒత్తిడి చేసి అరెస్టు చేసి సమీప పోలీసు స్టేషన్లలో నిర్బంధించారని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని కోరారు. సమావేశంలో శంకర గౌడ్, స్వర్ణ, చంద్రకళ, జంగం గంగాధర్, నన్నేసాబ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



డిచ్‌పల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకుడు వరుణ్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నాయని, కానీ పేద విద్యార్థులకు కనీసం మధ్యాహ్న భోజనం పెట్టలేకపోతున్నారని విమర్శించారు. ఇకనైనా విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యశ్వంత్, సాయి కిరణ్, వినీల్, శ్రవణ్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

నిజామాబాద్ సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో ఉన్న సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా రైతాంగానికి యూరియా దొరకక తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరగటంతో యూరియా కొరత తీవ్రంగా పెరిగిందన్నారు. దీంతో రైతులు సొసైటీల వద్ద బారులు తీరి రోజుల తరబడి ఎదురు చూస్తున్నారని అన్నారు. యూరియాను అందించడంలో కేంద్రం సరైన ప్రణాళిక లేకపోవడమే కారణమన్నారు. కేంద్రం వివక్షతకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు పెద్దివెంకట్రాములు, నన్నేసాబ్, శంకర్‌గౌడ్, గంగాధర్ పాల్గొన్నారు.

కార్మికుల మహాసభను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ నెల 27న నిర్వహించే వ్యవసాయ మార్కెట్ యార్డు కార్మికుల రాష్ట్ర 2వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి ఓమయ్య కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులోని ఏఐటీయూసీ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను ఓమయ్య విడుదల చేశారు. సభలో మార్కెట్ యార్డులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, రాబోయే కాలంలో మార్కెట్ యార్డుల అభివృద్ధికి తీసుకునే కార్యక్రమాలను నిర్ణయించనున్నట్లు తెలిపారు. సభను కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. నర్సింగరావు, చక్రపాణి, భాగ్యలక్ష్మి, సాయిలు, హనుమాన్లు, అనిల్, కవిత, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


కొత్త రైల్వే డివిజన్‌ను మంజూరు చేయండి



రైల్వే అధికారికి వినతిపత్రం అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్‌కు కేటాయించిన కొత్త రైళ్లు, రైల్వే డివిజన్ మంజూరు చేయాలని సికింద్రాబాద్ నిజామాబాద్ సెక్షన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ రేకులపల్లి చంద్రశేఖర్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జోన్ కార్యాలయ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శ్రీధర్‌కు వినతి పత్రం సమర్పించారు. హైదరాబాద్ డివిజన్‌లో కాచిగూడ తర్వాత అతిపెద్ద ఆదాయం నిజామాబాద్ రైల్వే డివిజన్‌కు ఉందని అన్నారు. అమృత్ భారత్ పథకం కింద రైల్వేను కేటాయించి రూ.53.30 కోట్ల అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ రెండవ ముఖద్వారం వైపు ఆరవ ప్లాట్‌ప్లాం నిర్మాణం చేపట్టి భవనాన్ని విస్తరించాలని పేర్కొన్నారు. బోధన్–బీదర్, ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్ రైల్వే లైన్ పనులను నిధులు మంజూరు చేసి వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. నిజామాబాద్ నుంచి దేశ రాజధాని ఢిల్లీకి, వారణాసి, సూరత్‌కు నేరుగా రైలు సౌకర్యం కల్పించాలన్నారు. గతంలో రద్దు చేసిన నిజామాబాద్ నుంచి ప్రారంభమయ్యే ఎల్లోరా, మీనాక్షి ఎక్స్‌ప్రెస్‌లను పునరుద్ధరించాలని అన్నారు.

దేవీమాత మండపానికి భూమిపూజ



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గంగస్థాన్‌లో శనివారం దేవీమాత మండపానికి బ్రహ్మశ్రీ జ్యోషి మధుసూదన్ శర్మ శనివారం భూమి పూజ చేశారు. ప్రతి ఒక్కరూ నవరాత్రులను ఘనంగా నిర్వహించుకోవలన్నారు. కాలనీవాసులు రాకేశ్, లౌక్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటా

డిచ్‌పల్లి: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్టు లక్కవత్రి నారాయణ కుటుంబానికి అండగా ఉంటానని టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన జర్నలిస్టు కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా నారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. తన వంతు సాయంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పీసీసీ అధ్యక్షుడి వెంట పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు నరాల రత్నాకర్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించిన అధికారులు

నిజామాబాద్ సిటీ: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన పలు నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. శనివారం జిల్లా కేంద్రంలోని గౌతంనగర్ వద్ద డ్రెయినేజీపై చేపట్టిన నిర్మాణాన్ని జేసీబీతో బల్దియా అధికారులు తొలగించారు. సారంగపూర్ శివారులో ఇతరుల స్థలం ఆక్రమించి తాత్కాలికంగా నిర్మించిన నిర్మాణాన్ని సైతం టౌన్‌ప్లానింగ్ అధికారులు జేసీబీలతో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం, డ్రెయినేజీల మీద నిర్మాణాలు చేపట్టవద్దని అన్నారు.

పీసీసీ అధ్యక్షుడు మరిన్ని పదవులు చేపట్టాలి



పీసీసీ అధ్యక్షుడికి కేక్ తినిపిస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: పీసీసీ చీఫ్ మరిన్ని పదవులు చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పీసీసీ అధ్యక్షుడు బాధ్యతలు చేపట్టి ఏడాది అయిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శనివారం జిల్లాకేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో సంబురాలు చేపట్టారు. పీసీసీ చీఫ్‌తో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి, నాయకులు బాడ్సి శేఖర్ గౌడ్, నగేశ్‌రెడ్డి, రాజమహేందర్, ఆకుల మహేందర్, నరేందర్ సింగ్, సుభాష్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ జి. రాజాబాబు : 9849180084
నిజామాబాద్ రూరల్ ఎం. రాజేంధర్ : 9966958559
బాన్సువాడ ప్రదీప్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899